ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 1 జూలై 2024

జిల్లాలో సోమవారం(నేడు) పింఛన్ల పండుగ జరగనున్నది. ఎన్డీఏ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలల పెండింగ్ పింఛన్ రూ.3 వేలు కలిపి మొత్తం ఏడువేల రూపాయలను లబ్ధిదారులకు అందచేయనున్నారు. అలాగే దివ్యాంగులకు, వ్యాధిగ్రస్థులకు, ఒంటరి మహిళలకు, వివిధవృత్తుల వారికి కూడా పెంచిన పెన్షన్ మొత్తాన్ని ఇవ్వనున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించి, సాయంత్రం ఆరుగంటలకు పూర్తిచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పెన్షన్ పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేతోపాటు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఆయా ప్రాంతాల్లోని స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా పాల్గొననున్నారు. మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జీలు కూడా పెన్షన్ల పంపిణీలో పాల్గొననున్నారు. కాగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంగం మండలం సిద్ధిపురం జరిగే పింఛన్ల పంపిణీలో పాల్గొని పెన్షన్లు అందచేయనున్నారు. నెల్లూరు నగర పరిధిలోని యలమవారిదిన్నెలో మంత్రి నారాయణ పింఛన్లు పంపిణీ చేయనున్నారు.



- అర్హులందరికీ ఇళ్ల వద్దే పంపిణీ
- మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు సచివాలయ సిబ్బంది అందజేత
- నేటి సాయంత్రానికి పూర్తిచేసేలా ఏర్పాట్లు

నేడు పింఛన్ల పండుగ

• సభలు, సమావేశాలకు స్వస్తి

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపణీని పెద్ద ఎత్తున చేప ట్టనున్నారు. ఒక్క రోజులోనే 99 శాతం పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఒకరిద్దరు మిగిలి ఉంటే మంగళ వారం పంపిణీ చేయను న్నారు. గతంలో మాదిరిగా సభలు, సమావేశాలు పెట్టి పింఛన్ల పంపిణీ చేసే కార్యక్రమానికి స్వస్తి పలికారు. జిల్లాలో 3,16,001 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందనున్నాయి. వారికి రూ.216.07 కోట్లను పింఛన్‌గా అందచేయనున్నారు.

- నెల్లూరు (హరనాథపురం)

ఒక్కరోజులోనే పంపిణీ

జిల్లాలో సోమవారం ఉదయం పింఛన్ల పంపిణీని ప్రారంభించి, సాయంత్రంలోగా నూటికి నూరుశాతం పూర్తి చేయించటానికి అన్నీ ఏర్పాట్లు చేశాం. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే మంగళ వారం అందచేస్తాం. అర్హులందరికీ ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందచేస్తాం.



- కేవీ సాంబశివారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ





సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పాల్గొన్న ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

పెరిగిన పింఛన్ ఇలా

పింఛను పేరు	ఇస్తున్న పింఛను	పెరిగిన పింఛను
వృద్ధాప్య	3000	4000
వితంతు	3000	4000
చేనేత కార్మిక	3000	4000
కల్లుగీత కార్మిక	3000	4000
మత్స్యకార	3000	4000
ఒంటరి మహిళ	3000	4000
ట్రాన్స్‌జండర్	3000	4000
చర్మకార	3000	4000
హెచ్‌ఐవీ	3000	4000
డప్పు కళాకారులు	3000	4000
కళాకారులు	3000	4000
దివ్యాంగులు	3000	6000
పెరాలసిస్‌తో మంచం పట్టిన వారికి, తీవ్ర అనారోగ్యంతోఉన్న వారికి	5000	15000
కిడ్నీ, కాలేయం గుండెమార్పిడి చేసుకున్న వారికి	5000	10000

పింఛన్ల పంపిణీలో భాగస్వాములు కండి

• మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూన్ 30: తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరగనున్నదని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సామాజిక పింఛన్లు సోమవారం అందచేయనున్నామన్నారు. 8,500 మంది ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛను సొమ్మును అందచేస్తా మన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిని కూడా చేసి చూపిస్తామని తెలిపారు. కేంద్రానికి సరైన బిల్లులు అందించకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు ఏకంగా రూ. 1000 కోట్లు నిలిచిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

• 8వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ • హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

నెల్లూరు (విద్య), జూన్ 30 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా(ఎంపీసీ స్ట్రీమ్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2024 కౌన్సెలింగ్ సోమవారం (నేటి) నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకోసం నెల్లూరు వెంకటేశ్వరపురంలోని బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనతో అధికారులు కౌన్సె లింగ్ నిర్వహించనున్నారు. అలాగే ఎన్‌సీసీ, క్రీడలు, క్యాప్, విభిన్న ప్రతిభా వంతుల ధ్రువపత్రాలను సైతం పరిశీలించనున్నారు.

• అందుబాటులో 11 వేలకుపైగా సీట్లు



జిల్లాలో ప్రస్తుతం 22 ఇంజనీరింగ్ కళాశాలల్లో 11 వేలకు పైగా సీట్లు అందు బాటులో ఉన్నాయి. వీటిలో పది కళాశాలకు మాత్రమే డిమాండ్ అధికంగా ఉంది. పేరున్న కళాశాలల్లోనే బీటెక్ పూర్తిచేస్తే పిల్లల భవిత బాగుంటుందన్న అభిప్రాయంతో తల్లిదండ్రులు డొనేషన్ల విషయంలో వెనుకాడని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంసెట్ ర్యాంకుతో పనిలేకుండా యాజమాన్య కోటా(బీ-కేటగిరి) సీట్లకు డిమాండ్ పెరిగింది. నిబంధనల ప్రకారం కన్వీనర్ కోటా ఫీజునే తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఇది అమలుకు నోచుకోవడంలేదు. తాజాగా కంప్యూటర్ సైన్స్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కొన్ని బ్రాంచ్‌ల్లో సీట్లను యజమాన్యాలు తగ్గించుకుని ఈ సీట్లను పెంచుకుంటున్నాయి. అలాగే ప్రస్తుతం ఉన్న కోర్సులతో పాటు ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వంటి కొత్త కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. వీటికి కూడా డిమాండ్ అధికంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రైవేట్ విశ్వవిద్యాల యాల్లోని 35 శాతం సీట్లను వెబ్ కౌన్సెలింగ్ పరిధిలోకి తీసుకువచ్చారు. వీటికి కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లను వర్తింపచేయనున్నారు. జిల్లాలో మొత్తం 16వేల మందికి పైగా విద్యార్థులు ఏపీ ఈఏపీసెట్‌కు హాజరు కాగా, 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ర్యాంకర్లు కొందరు జేఈఈ, ఎన్ఐటీ, ఐఐటీల్లో చేరడంతో మరికొన్ని సీట్లు ఖాళీగా ఉండే అవకాశం ఉంది. ర్యాంకు సాధించిన ప్రతి ఒక్కరికీ సీట దక్కే అవకాశాలున్నట్లు విద్యావేత్తలు చెబుతున్నారు.

• ప్రవేశాలకు షెడ్యూల్ ఇలా...

కౌన్సెలింగ్‌లో భాగంగా తొలుత సోమవారం నుంచి జూలై 7వతేదీ వరకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. 4 నుంచి 10వతేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 8 నుంచి 12వతేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అలాగే 13న కళాశాలల ఎంపిక మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. 16న సీట్ల కేటాయింపు, 17 నుంచి 22వతేదీ వరకు కళాశాలల్లో రిపోర్టింగ్ చేసుకోవాలి. జూలై 19 నుంచి తరగతులు నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదోతరగతి, ఇంటర్ మార్కుల జాబితా, నాలుగు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలి.

నేటి నుంచి కొత్త చట్టాల అమలు

- ఐపీసీ బీఎన్ఎస్‌గా మార్పు
- పోలీసు అధికారులకు అవగాహన ఏది ?
- మొక్కుబడిగా ఆన్‌లైన్ మీటింగ్‌లు

నెల్లూరు(క్రైం), జూన్ 30: ఎప్పటి నుంచో అమల్లో ఉన్న వివిధ పోలీసు చట్టాలు కొత్తగా రూపుదిద్దుకున్నాయి. నూతన చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కొత్తగా బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత్)గా పేరు మార్పు చెంది సెక్షన్లు నెంబర్లుగా మారాయి. ఐపీసీ సెక్షన్‌లోని 80 చట్టాలు బీఎన్ఎస్ చట్టాలుగా మారాయి. ఇక సీఆర్‌పీసీ చట్టాలు భారతీయ నాగరిక్ సురక్ష సంహితగా రూపాంతరం చెందాయి. మార్పు చెందిన చట్టాలపై అటు పోలీసులకు కానీ, ఇటు ప్రజలకు కానీ పెద్దగా అవగాహన లేదు. పోలీసు అధికారులకు మాత్రం జిల్లా అధికారులు కొద్ది రోజుల్లో ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించి, వాట్సప్ మెసేజ్‌లు పెట్టి కొంత మేరకు అవగాహన కల్పించారు. అయినా అన్నీ చట్టాలపై పోలీసు అధికారులకు ఇంకా పెద్దగా అవగాహన రాలేదు. కిందస్థాయి సిబ్బంది అంటే ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులకు అయితే అసలు కొత్త చట్టాలపై అవగాహనే లేదని చెప్పాలి. కనీసం బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ అంటే అర్థం కూడా తెలియని పోలీసులు చాలామందే ఉన్నారు. పోలీసుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల సంగతి చెప్పనక్కరలేదు. సామాన్యులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం పదే పదే చెబుతున్నా పట్టించుకునే వారులేరు. గతనెలలో మూడుసార్లు ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు అవగాహన కల్పించారు. అయితే అవి ఎక్కువన్నట్లుగా ప్రజలకు అసలు అవగాహనే కల్పించలేదు.







బీఎన్ఎస్ఎస్ చట్టాలు ఇలా..

సీఆర్‌పీఎస్	బీఎన్ఎస్ఎస్
41-ఎ	35
41-బి	36
41-సి	37
41-డి	38
50(1)	47
50(2)	48

మార్పు చెందిన వాటిలో ఇవి కొన్ని మాత్రమే. ఇలా 22 చట్టాలు మారాయి.


కొత్తగా రూపొందించిన చట్టాలు

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ సెక్షన్లు)	భారతీయ న్యాయ సంహిత్ (బీఎన్ఎస్ నెంబర్లు)
302	103
304	105
304-ఎ	106
304-బి	80
306	108
307	109
324	118
34	3(5)
109	49
120-బి, 511	62

..ఇలా 80 ఐపీసీ సెక్షన్లు బీఎన్ఎస్ నెంబర్లగా మార్పు చెందాయి.

• స్పందించని ఎస్పీ

కొత్త చట్టాల అమలుపై వివరణ కోరేందుకు జిల్లా ఎస్పీకి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. సోమవారం నుంచి అమలు కానున్న ఈ చట్టాలు ఎంతవరకు ప్రజలకు న్యాయం చేకూర్చుతాయో వేచి చూడాలి.



- ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు వైద్యుల చికిత్స
- కరోనా నియంత్రణలోనూ వారి కృషి ప్రశంసనీయం
- జిల్లాలో రెండువేల మందికిపైగా డాక్టర్లు

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

అంకితభావంతో విధులు

నెల్లూరు(వైద్యం) జూన్ 30: సాధారణ వ్యాధులతో పాటు ప్రాణాంతక వ్యాధులకు కూడా చికిత్సలు అందించటంలో వైద్యులు కనబరుస్తున్న పనితీరు ప్రశంసనీయం. కేవలం వైద్యచికిత్సలకే వారు పరిమితం కాకుండా వివిధ స్వచ్ఛంద సేవల్లోనూ వారు పాల్గొంటూ గుర్తింపు పొందుతున్నారు. 2020 నుంచి 2022 వరకు కరోనా కాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి కరోనా రోగులకు వైద్య చికిత్సలు అందించారు. నాటి వారి సేవలను నేటికీ కూడా జిల్లా ప్రజలు మర్చిపోలేదంటే వారి సేవలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థంఅవుతుంది. కరోనా సమయంలో జిల్లాలోని ఐదుగురు వైద్యులు మృత్యువాత పడడం ఆందోళన కలిగించే అంశం. అయినా అధైర్య పడకుండా వారు తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నారు.

• ఎంతోమందికి అవార్డులు

వైద్యో నారాయణ హరి అన్న సూక్తికి అనుగుణంగా ఎంతోమంది వైద్యులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. జిల్లాలోని పలువురు వైద్యులు తమ వృత్తిలో ప్రతిభ కనబరిచి అవార్డులు కూడా అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,27,098 మంది కరోనాకు గురికాగా, అందులో 1,22,876 మంది కోలుకున్నారు. ఇంతమంది కోలుకోటానికి వైద్యులు చూపిన చొరవ మరువలేనిదని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. అలాగే పలు ప్రాణాంతక వ్యాధులకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించటంలోనూ వైద్యుల కృషి ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో వైద్యుల సేవలకు ప్రతిరూపంగా పశ్చిమ బెంగాల్ రెండవ ముఖ్యమంత్రి, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా జూన్ ఒకటిన కేంద్ర ప్రభుత్వం వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది.

• జిల్లాలో 2వేల మందికిపైగా వైద్యులు

జిల్లాలో రెండువేల మందికిపైగా వైద్యులు ఉన్నారు. 1300లకు పైగా ఆసుపత్రు లు ఉన్నాయి. ఇందులో కార్పొరేట్ ఆసుపత్రులు 50కిపైగా ఉన్నాయి. జీజీహెచ్‌తోపాటు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, రెండు ఏరియా ఆసుపత్రులు, 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. 24 గంటల ఆసుపత్రులు మరో 27 వరకు ఉన్నాయి. అలాగే 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలోనే 470 మందికిపైగా వైద్యులు పనిచేస్తున్నారు. మిగిలిన వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ, సొంత క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

అంకితభావంతో వైద్య చికిత్సలు



జిల్లాలోని వైద్యులు అంకితభావంతో వైద్యచికిత్సలు అందిస్తు న్నారు. కరోనా సమయంలో ఐదుగురు వైద్యులు మృత్యువాత పడ్డా ఏ మాత్రం అధైర్య పడకుండా వైద్య చికిత్సలు అందిస్తు న్నారు. ఆధునిక వైద్యవిధానాలపై అవగాహన పెంచుకుని రోగులకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కూడా తమ వంతు కృషి చేస్తున్నది.

- డాక్టర్ అశోక్, ఐఎంఏ జాతీయ కమిటీ సభ్యుడు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య సేవలు



జిల్లాలో ఉన్న పీహెచ్‌సీల ద్వారా వైద్యులు గ్రామీణులకు ఉత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎప్పటి కప్పుడు ప్రజలకు వ్యాధులపై అవగాహన కలిగిస్తున్నారు. జిల్లాలో ప్రజారోగ్యానికి వైద్యులు అంకితభావంతో పనిచేస్తున్నారు. అలాగే పలు ఆరోగ్య పథకాలపై కూడా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

'హై లెవల్'పై ఆశలు

- సోమశిల ఎగువ ప్రాంత కాలువ పనుల్లో కదలిక
- పైలాన్ ప్రాంతాన్ని శుభ్రం చేయించిన అధికారులు
- కూటమి ప్రభుత్వంలో పనుల పూర్తిపై విశ్వాసం
- దృష్టి సారించిన యంత్రాంగం

అనంతసాగరం, జూన్ 30 : జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో గల అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి తదితర మండలాలకు సోమశిల నుంచి సుమారు ఐదుటీఎంల జలాలను తరలించి, తాగు, సాగునీటి అవసరాలు తీర్చేలా 2013లో హైలెవల్ కెనాల్‌కు రూపకల్పన జరిగింది. ఈక్రమంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమశిలలో హైలెవల్ కెనాల్ నిర్మాణానికి పైలాన్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1,560 కోట్లు ప్రతిపాదించారు. విడతల వారీగా పనులు జరిగేలా ప్రణాళికలు రూపొందించారు. వివిధ కారణాలతో 2015 వరకు పనులు జరగలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం హై లెవల్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. మొదటి విడత కింద రూ.527కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. పనుల్లో పురోగతి కనిపిస్తున్న తరుణంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పనులకు రీటెండరింగ్ పేరుతో రూ.459 కోట్లకు కుదించింది. దీంతో పనులు అనుకొన్న మేరకు జరగలేదు. మొదటివిడత పనులు పూర్తికాకుండానే 2020 నవంబరు 9న రెండోవిడత పనులకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. రెండోదశ కింద ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో 46,453 ఎకరాలకు నీరు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. కానీ పనుల్లో పురోగతి కనిపించలేదు. నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. అనంత సాగరం మండలం సోమశిల, యకర్లపాడు వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లు శిథిలావస్థకు చేరుతున్నాయి. పడమటి నాయుడుపల్లి వద్ద రిజర్వాయరు పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. రైతులకు పరిహారం చెల్లించలేదు. ఇర్లపాడు, పొంగూరు, కంపసముద్రం రిజర్వాయర్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.



ఎన్నికల ముందు...



ఎన్నికల తర్వాత హైలెవల్ పైలాన్

• కూటమి ప్రభుత్వంపై ఆశలు

హైలెవల్ కెనాల్ కింద రిజర్వాయర్లలో నీటి నిల్వ చేసి నీరు ఇచ్చే కార్యక్రమంలో అడ్డంకులు తొలగక పోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రిజర్వాయర్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో భూములు తీసుకొన్న రైతులకు పూర్తిస్థాయి లో వైసీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ప్రజలకు భరోసా ఏర్ప డింది. ఇప్పటికే ఈపనుల్లో కదలిక కనిపిస్తుంది. ముళ్లపొదల నడుమ సోమశిలలో ఉన్న హైలెవల్ కెనాల్ పైలాన్‌ను అధికారులు ఇటీవల శుభ్రం చేయించి సుందరంగా తీర్చిదిద్దారు. మంత్రి ఆనం రామనారా యణరెడ్డి నైతృత్వంలో త్వరగా పనులు పూర్తవుతా యని ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గాల ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలో ఇప్పటివరకు వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల్లో అమలు చేస్తున్న కార్యకలాపాలను మార్పు చేశారు. ఈ మేరకు రెండురోజుల క్రితం రాష్ట్ర వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ నుంచి వ్యవసాయ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేంద్రంలోని కియోస్కోలు, సాఫ్ట్‌వేర్ యాప్‌ల్లో చిత్రీకరించిన నవరత్నాల లోగోలోని మాజీ సీఎం జగన్ ఫొటోను తొలగించి సీఎం చంద్రబాబు ఫొటో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే జిల్లా వ్యవసాయ సలహా బోర్డుతోపాటు మండల స్థాయి వ్యవసాయ సలహా బోర్డుల కమిటీలను వెంటనే రద్దు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా మాసపత్రిక పేరును పాడి పంటలుగా పేరు మార్చారు.

అక్రమాలకు అడ్డాగా పరిశ్రమల కేంద్రం

పట్టించుకోని నిఘా విభాగాలు

వెంకటాచలం, జూన్ 30 : స్థానిక గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పరిశ్రమల కేంద్రం అక్రమాలకు అడ్డాగా మారినా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేంద్రంలో సుమారు 200కుపైగా చిన్న, పెద్దా పరిశ్రమలు ప్రభుత్వం వద్ద రిజిస్టరై ఉన్నాయి. ప్రముఖ మోటారు కంపెనీలైన అశోక్ లేలాండ్, మహీంద్రా మోటార్స్ సంస్థలతోపాటు మరికొన్ని ప్రసిద్ధిగాంచిన పరిశ్రమలు ఇందులో నడుస్తున్నాయి. కాగా, ఇక్కడ నమోదైన పరిశ్రమలకు బదులుగా ఇతర పరిశ్రమలు ఎక్కువగా నడుస్తున్నాయి. పరిశ్రమ కోసం ప్లాటు కొన్నవారు ఇతరులకు అద్దెకు ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. పరిశ్రమల కేంద్రంలో నిఘా లేనందువల్ల పరిశ్రమల కోసం కేటాయించిన ప్లాట్లలోని భవనాలను చీకటి వ్యాపారాలకు కేంద్రాలుగా మార్చిన సందర్భాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వెల్డింగ్ యూనిట్ పేరుతో రిజిస్టరైన ప్లాటులోని భవనంలో టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగలు బయటపడడంతో అప్పట్లో జిల్లాలో సంచలనంగా మారింది. మూడేళ్ల క్రితం గుట్కా తయారీ కేంద్రం గుట్టు రట్టయింది. గుట్కాలు తయారుచేసి ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా ఈ కేంద్రంలోని భవనాలు పేకాట కేంద్రాలుగా కూడా మారాయి. ఇతర రాష్ట్రాల నుండి వచ్చినవారు ఎంతోమంది ఉపాధి పేరుతో ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వాళ్లలో నేరగాళ్లు, ఉగ్రవాదులు ఉన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. పోలీసులు ఈ పరిశ్రమల కేంద్రాన్ని తరచుగా తనిఖీచేస్తే నేరగాళ్లకు, చీకటి కార్యకలాపాలకు చెక్ పెట్టవచ్చు.



గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పరిశ్రమల కేంద్రం

నేడు పింఛన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 30: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం లబ్ధిదారులకు 7వేల రూపాయలు పింఛను ఇస్తున్నట్లు పలు గ్రామ పంచాయతీలలో ఆదివారం దండోరా వేశారు. సోమవారం ఉదయం ఇళ్లకు వచ్చి పింఛను అందజేస్తారని తెలియజేశారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు, బీసీ కాలనీలో సోమవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు తెలిపారు.

చెముడుగుంటలో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం, జూన్ 30: మండలంలోని చెముడుగుంట గ్రామంలో ఆదివారం నెల్లూరు మాగుంట లే అవుట్ వద్ద ఉన్న ఎనెల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ, రక్త పరీక్షలు, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించి రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎనెల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కులారి నాగేంద్ర ప్రసాద్, వైద్యులు, టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: స్థానిక కోదండరామపురంలోని గాయత్రి క్లినిక్ ఆధ్వర్యంలో నెల్లూరు యామిని న్యూరోకేర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో న్యూరాలజిస్టు డా. యామిని రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి క్లినిక్ ఫార్మాసిస్టు కే వీరేంద్రనాథ్, న్యూరోకేర్ పీఆర్‌వో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూన్ 30: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహం, ఆశ్రమ స్థల దాత పొనక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు వస్త్రాలు సమర్పించారు. మహాత్మాగాంధీ జీవిత విశేషాల గురించి స్కూల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం పిల్లలకు తినుబండారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల సంఘం అధ్యక్షుడిగా గోవర్ధనరెడ్డి ఎన్నిక

కోవూరు, జూన్ 30: నెల్లూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పడుగు పాడు సొసైటీ అధ్యక్షుడు కొండూరు గోవర్ధనరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో ఆది వారం జరిగిన రెండు జిల్లాల అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయనను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా వెంకటగిరి సొసైటీ అధ్యక్షుడు ఏ శ్రీని వాసులు, ప్రధాన కార్యదర్శిగా లింగంగుంట సొసైటీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శిగా ఎన్ ప్రతాప్, డైరక్టరుగా లాలాపేట సీఈవో సిద్దేష్ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్‌రెడ్డిని పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్లు అభినందించారు.

ఎన్టీఆర్ గృహాలకు బిల్లులివ్వండి : చేజెర్ల

నెల్లూరు(వైద్యం), జూన్ 30 : రాష్ట్రంలో 2018-19లో ఎన్టీఆర్ గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఫిబ్రవరి నాటికి ఎన్నికల కోడ్ రావటంతో అప్పటి వరకు రూ.1350 కోట్ల బకాయిలు నిలిచి పోయాయన్నారు. ఆతర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సదరు బకాయిలపై దృష్టిసారించాలని కోరారు. జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మూలస్థానేశ్వర ఆలయ ఈవో ఉద్యోగ విరమణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30: నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో) వేణుగోపాల్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు ఈవో వేణుగోపాల్ దంపతులను సత్కరించారు.

శ్రీకృష్ణ రాసలీలలపై ప్రవచనం

భారత సంస్కృతికి మూలమైన భారతం, భాగవతం ఎప్పుడూ ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంటాయని శతావధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు తెలిపారు. బాలాజీనగర్ సీతారామ మందిరంలో పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీకృష్ణ కథామృతం సప్తాహంలో రాసలీల అనే అంశంపై ఆదివారం రాత్రి ఆయన ప్రవచనం చేశారు. శ్రీకృష్ణుడు తన యోగమాయను ప్రదర్శించి గోపికలను అలరించి తరింపజేసిన మహాయోగ ప్రదర్శనయే రాసలీల సన్ని వేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, చక్కిరాల జయప్రసాద్, సూరం చంద్ర శేఖరం, అగస్త్యరాజు సుబ్బారావు పాల్గొన్నారు.

నగరంలో హంపీ పీఠాధిపతి

హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాధిపతి విద్యారణ్య భారతిస్వామి ఆదివారం రాత్రి నెల్లూరు చేరుకున్నారు. బాలాజీనగర్‌లో బస చేసిన స్వామీజీ సోమవారం ఉదయం అక్కడి కార్యక్రమంలో పాల్గొని అనంతరం కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని మహా మృత్యుంజయేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శిస్తారని భక్తుడు, న్యాయవాది శ్రీకంఠం రమణయ్య తెలిపారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో అన్నదానం

● కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి


అన్నదానం చేస్తున్న కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభానురెడ్డి

విడవలూరు, జూన్ 30: రామతీర్థం రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం మండలంలోని గాదెలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దివంగత వెల్లంపల్లి పార్థసారధి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్నదానం చేసే భాగ్యం కలగడం రామలింగేశ్వర స్వామి అనుగ్రహ పుణ్యమని అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో ఆమె సూచనల మేరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని చెప్పారు. కల్యాణం, తీర్థవాది రోజుల్లో విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెల్లంపల్లి దిలీప్ కుమార్, తంగిల్ల కరుణాకర్, కొండూరు శ్రీధర్, దాడి అంకయ్య, దాడి సన్యాసిరావు, వైసీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కాకాణి ధనదాహానికి తరలిపోయిన కంటైనర్ టెర్మినల్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, జూన్ 30: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధనదాహం వల్లే కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోయిందని ముత్తుకూరు మండల టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం మండల టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టోల్‌గేట్లు పెట్టి అక్రమ వసూళ్లతో కంటైనర్‌కు వచ్చే వాహనాలను అడ్డుకోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ప్రజలు తగు రీతిలో బుద్ధిచెప్పినా తెలుసుకోకపోవడం కాకాణి దౌర్భాగ్యం అన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారి కోసం, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం అవసరమైతే అదాని కాళ్లు పట్టుకుంటామని సోమిరెడ్డి చెప్పిన విషయాన్ని వక్రీకరించడానికి కాకాణి ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు షేక్ అబ్దుల్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం జగనన్న లేఅవుట్‌లో అక్రమాలు : టీడీపీ


మాట్లాడుతున్న తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల రాజేంద్ర

వెంకటాచలం, జూన్ 30: స్థానిక జగనన్న లేఅవుట్‌లో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల రాజేంద్ర ఆరోపించారు. వెంకటాచలంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వైసీపీ నేతలు లబ్ధిదారులకు ఇచ్చిన నకిలీ ఇళ్లస్థలాల పట్టాలను చూపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల కిందట మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ జడ్పీటీసీ మందల వెంకటశేషయ్య తన ఇంట్లో దాచి ఉంచిన ఇళ్ల స్థలాల నకిలీ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారని, ఇప్పుడు అది ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లేఅవుట్‌లో 700కుపైగా ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేశారని, వాటిలో సగానికిపైగా వైసీపీ నేతలే స్వయంగా లక్షల రుపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. వైసీపీ నేతలు ఇష్టారీతిలో ప్లాట్లు అమ్ముకొని కోట్ల రుపాయలు దోచుకున్నారని, విషయాన్ని స్థానిక, మండల టీడీపీ నాయకత్వం ద్వారా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి లేఅవుట్‌లో జరిగిన అక్రమాలపై అధికారులచే క్షేత్రస్థాయిలో విచారణ చేయించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప్పు రాఘవేంద్ర, కాంచన అశోక్, ఉప్పు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ జాతర


దుర్గమ్మ జాతరకు వెళుతున్న యాచవరం గ్రామస్థులు

మనుబోలు, జూన్ 30: మండలంలోని యాచవరం గ్రామంలో ఆదివారం దుర్గమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి, పంటలు పండి సుభిక్షంగా ఉండాలంటూ పొంగళ్ళు కుంభాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి మూడు సంవత్సరాలకోసారి గ్రామస్థులు గ్రామదేవత దుర్గమ్మకు జాతర చేస్తారు. దుర్గమ్మ ఆలయం పంటపొలాల్లో ఉండడంతో గ్రామంలో ప్రతి ఇంటినుంచి మహిళలు సామాగ్రిని తీసుకుని కలిసి వెళతారు. పొంగళ్ళు, మొక్కులు తీర్చుకుని, భోజనాలు చేసిన అనంతరం సాయంత్రం అంతా కలసికట్టుగా గ్రామానికి వస్తారు.

అర్హత ఉన్నా.. అందని పింఛన్లు ?

● సవాలక్ష కారణాలతో ఆపిన జగన్ సర్కార్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 30: జగన్ సర్కార్‌లో అర్హత ఉన్నా పింఛన్లు అందలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లులు, భూములు, వాహనాలు, ఇతర ఆస్తులు లేకపోయినా వున్నట్లు అంటగట్టి ఆన్‌లైన్లో అనర్హులుగా చూపి పింఛన్లు తొలగించారని, దీంతో పింఛన్లు కోసం సచివాలయాలు, తహసీల్దారు, మండల పరిషత్, విద్యుత్, ఆర్డీవో కార్యాలయాలు, ఆధార్ సెంటర్లకు తిరిగినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. పింఛన్లు తొలగించడంతో పలువురు వృద్ధులు, వితంతువులు కుటుంబాలు జరగక వీధిన పడ్డారు. దీంతో ఐదేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వం కోసం ఎదురు చూసిన పింఛనుదారులు చంద్రబాబునాయుడికి పట్టంకట్టారు. జగన్ సర్కార్ పెట్టిన అడ్డగోలు ఆంక్షలు ఎత్తేసి పింఛన్లు ఎప్పుడిస్తారా అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

జగన్ వచ్చాడు.. పింఛను ఆపాడు : గంట మస్తానమ్మ

70 రూపాయల నుంచి వితంతు పింఛను తీసుకున్నాను. గతంలో చంద్రబాబునాయుడి పాలనలో ఇచ్చిన రూ. 2వేలు పింఛను కూడా తీసుకున్నాను. కాగా, జగన్ వచ్చిన తరువాత 3నెలలు వచ్చింది. ఆ తరువాత ఐదేళ్ల నుంచి వేలిముద్రలు పడడంలేదని ఇవ్వలేదు. చంద్రబాబు ప్రభుత్వంలో వేలిముద్రలు పడకున్నా ఇచ్చారు. కాన్సర్‌తో బాధపడుతున్న తనకు న్యాయం చేయాలని మస్తానమ్మ అధికారులను వేడుకుంటోంది.

జాతీయ ఆర్చరీ క్రీడాకారులకు అభినందన

నెల్లూరు (విద్య) : జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా ఆర్చరీ క్రీడాకారులను క్రీడా ప్రముఖులు అభినందించారు. రాష్ట్రపోటీల్లో రాణించిన 12 మంది క్రీడాకారులను నగరంలోని ఆదిత్యనగర్ మునిసిపల్ పార్కులో ఆదివారం సత్కరించారు. డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షకార్యదర్శులు మహేష్‌రెడ్డి, గురుప్రసాద్, ఆర్చరీ సంఘం అధ్యక్షకార్యదర్శులు పీ శ్రీహర్ష, వేణు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్నారు !

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి

● చంద్రబాబు ప్రతిమలకు పాలాభిషేకం


చంద్రబాబు ప్రతిమకు పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


పాలభిషేకం చేస్తున్న పింఛన్‌దారులతో కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు(సిటీ/వైద్యం), జూన్ 30 : ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకుంటున్నారని, ఇది ఆయనకే సాధ్యమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కొనియాడారు. పెంచిన సామాజిక పింఛన్లను సోమవారం పంపిణీ చేయనున్న సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు ప్రతిమకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా బాలాజీ నగర్ త్యాగరాయ కల్యాణ మండపంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం పింఛనుదారుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచి పంపిణీ చేయనున్నారని చెప్పారు. నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ మున్సిపల్ మంత్రి అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగరాలకు అభివృద్ధి చెందే అవకాశం వచ్చిందన్నారు. నెల్లూరు నగరంలో గతంలో ఆగిపోయిన పనులు వేగవంతం అవుతాయన్నారు. అనంతరం 13వ డివిజన్ టీడీపీ అధ్యక్షు డు తానే మస్తాన్ ఆధ్వర్యంలో పింఛనుదారులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి మల్లికార్జున, కాయల తిరుపతి, సుభాన్ బాషా, ఎలమందరెడ్డి, శేషయ్యనాయుడు, శ్రీకృష్ణ, పావురాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తా..

● ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం


మున్సిపల్ మంత్రి నారాయణను సత్కరిస్తున్న నూతన కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 : ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ సంఘం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేరుస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానని ఆ సంఘం అధ్యక్షుడు కోనగళ్ల శోభన్‌బాబు తెలిపారు. ఆదివారం రాత్రి రంగనాయకుల పేట ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల పేద ఆర్యవైశ్యులకు అందిస్తున్న పింఛన్లు యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అమరా మోహన్ రావు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి అరవేటి వెంకట ఫణీంద్రకుమార్, కోశాధికారి భోగనాథం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు తిరువీధి వెంకట కిషోర్‌కుమార్, అమరా శివ, పువ్వాడ వెంకట రమేష్‌బాబు, సహాయ కార్యదర్శులు చందాలు సతీష్‌కుమార్, తులసి వెంకట సురేంద్ర, తులసీ నాగేష్‌కుమార్‌లతోపాటు గౌరవ సలహాదారులు ప్రాజెక్టు చైర్మన్‌లు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, బులియన్ మర్చంట్స్ సంఘం రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్ పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడి ఉద్యోగ విరమణ

నెల్లూరు (విద్య), జూన్ 30 : పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీ వెంకటరాజు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని కేటీఆర్ కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం జరిగింది. యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు పెద్ద సంఖ్యలో హాజరై వెంకటరాజును ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మిట్టా కృష్ణయ్య, గిరిప్రసాద్, కరుణానిధి, మూర్తి, శ్రీనివాస రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ సేవ


గరుడ వాహనంపై మహావిష్ణువు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 : నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం లో గల గురువాయుర్ మహావిష్ణు ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహాకుంభారాధన, ఉత్సవమూర్తులకు అభిషేకం, ధన్వంతరి, అష్టాక్షరీ హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉభయకర్తలుగా మేడికొండ పద్మమోహన్, స్నేహ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సాహిత్యంతోనే సమాజ వికాసం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 : పురమందిరంలోని ఏసీ హాలులో విశాలాక్షి మాస పత్రిక 15వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. వ్యవస్థాపకుడు కోసూరు రత్నం, సంపాదకుడు ఈతకోట సుబ్బారావును సాహితీవేత్తలు అభినందించారు. ఈ సందర్భంగా సముద్రం కథల సంపుటిని ఆవిష్కరించారు. ఆడిటర్ చిన్నినారాయణరావుకు ఆత్మీయ సన్మానం జరిగింది. కార్యక్రమంలో అమరావతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నారద జయంతి

● జర్నలిస్టులకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 : నగరంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం దేవర్షి నారద జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా జర్నలిస్టు, సాయి డిజిటల్ నెట్‌వర్క్ సీఈవో చుండూరు సాయివెంకట సత్యనారాయణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ప్రసార మాధ్యమాల్లో దేశం గురించి చర్చ జరగాలని, లేకుంటే దేశం ప్రమాదంలో పడుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ సంచాలక్ బయ్యా శ్రీనివాసులు మాట్లాడుతూ నారదుడు కలహ భోజుడు కాదని, తొలి జర్నలిస్టు అని, పురాణాల్లో నారద పాత్ర అధర్మంపై ధర్మం గెలవడానికి పనిచేసిందని తెలిపారు. సాహితీ సుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా నారద జయంతి రోజున జర్నలిస్టులను గౌరవించుకుంటున్నామని చెప్పారు. అనంతరం జర్నలిస్టులను సత్కరించారు. పోస్టల్ సూపరింటెండెంట్ కాకర్ల శ్రీనివాస్, జర్నలిస్టులు సుజనీ, శిరీష, డీ నరేష్‌కుమార్, విక్రమకుమార్‌జైన్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు నాగారెడ్డి హరిచంద్రారెడ్డి, సాహితీ సుధ ఫౌండేషన్ సభ్యులు ఉదయ్‌కుమార్, మనోహర్, కేవీ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్‌లో వైద్య శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 : నగరంలోని రామ్మూర్తినగర్‌లో గల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. తొమ్మిది మంది వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సజ్జా వెంకట సురేష్, కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్, మదిర వెంకట సుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.

ప్రగతి చారిటీస్‌కు వీపీఆర్ విరాళం


ప్రగతి చారిటీస్ ఇన్‌చార్జికి విరాళం చెక్కు అందచేస్తున్న వీపీఆర్ దంపతులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30 : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నగరంలోని ప్రగతి చారిటీస్ సంస్థకు రూ.3 లక్షల విరాళం అందచేశారు. ఆ చారిటీస్ ఇన్‌చార్జి సుభాష్, పలువురు చిన్నారులతో కలిసి ఆదివారం వీపీఆర్ దంపతులను వారి నివాసంలో కలిశారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహణకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతి ఏటా రూ.3లక్షల విరాళం అందచేస్తున్నారని చెప్పారు.

నిత్యావసరాల వితరణ

నగరంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌లోని విద్యార్థులకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరకులు వితరణ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వీ లీలాకృష్ణ యాద వ్, మాధవరాజు, ప్రభాకర్‌రాజు, పీ విజయకుమార్, ఏ మురళి పాల్గొన్నారు

టీ20 వరల్డ్ కప్ విజయోత్సవం


కేక్ తినిపిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వైద్యం), జూన్ 30 : టీ20 వరల్డ్ కప్ సాధించిన భారత క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ డీవైఎఫ్ఐ నెల్లూరు నగర కమిటీ ఆదివారం పూలే బొమ్మ వద్ద సంబరాలు జరిపింది. ప్రముఖ న్యాయవాది అంకిరెడ్డి జనార్దన్‌రెడ్డి కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ భారత జట్టు సమష్టి కృషితో ప్రపంచ కప్పు సాధించిందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యువత కోసం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు తిరుపతి జగదీష్, నాయకు శేఖర్, కర్తం బాబు, ఫయాజ్, సాయి గణేష్, సురేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించండి

● సీఎంకు జేఏసీ నేతల విజ్ఞప్తి

నెల్లూరు (విద్య), జూన్ 30 : రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో జేఏసీ నేతలు సీఎంను కలిసి వినతిపత్రం అందచేశారు. ఎన్నికల కోడ్ కారణంగా కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని, దానిని పునరుద్ధరించాలని కోరారు. రెన్యువల్ ఉత్తర్వుల్లో జాప్యం కారణంగా రెండు నెలలుగా వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్ తెలిపారు.

కంటి వ్యాధులపై అవగాహన ఉండాలి

నెల్లూరు(వైద్యం): కంటి వ్యాధులపై పీహెచ్‌పీలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉం దని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ బీరం రాజేం ద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్మార్ట్‌విజన్ కంటి ఆసుపత్రి, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో కంటి వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. కంటి వ్యాధుల, వాటి నివారణపై వీడియో ప్రజెంటేషన్ ద్వారా డాక్టర్ రాజేంద్ర వివరించారు. నారాయణ వైద్య కళాశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వైద్య విధానాలపై పీఎంపీలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, న్యాయ సలహాదారు రమాదేవి, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


సకల సమస్యలూ ముంచెత్తినపుడు కనిపించని దేవుడ్ని నమ్ముకుని మనసు కుదుటపరచుకుంటాం. అనారోగ్యం ముట్టడించి ఆందోళనపరచినపుడు కనిపించే వైద్యుల మీద భారం వేసి చేతులు జోడిస్తాం. గంభీరంగా కనిపించే డాక్టర్ల తెల్లకోటు వెనుక నిరంతరం ఒక కల్లోలం సుడులు తిరుగుతూ ఉంటుంది. ప్రతి క్షణం ఒక సవాలే. ప్రతి రోగీ ఒక పాఠమే. ముఖ్యంగా అరకొర వసతుల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉప్పెనలా వచ్చిపడే కేసుల నడుమ ప్రతి డాక్టర్ చేసేది వైద్యావధానమే. మతం చూడరు. కులం చూడరు. రోగి స్తోమత చూడరు. ప్రతి ప్రాణం కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తారు. చదువుకున్న శాస్త్రానికి కూడా ఒక్కోసారి రోగం అర్థం కాదు. పరిస్థితి విషమించిన విపత్కర సమయంలో తీసుకునే నిర్ణయం కీలకమైనది. అది అన్నిసార్లూ ఉద్యోగ నియమాలకు లోబడి ఉండదు. మందులతో కాక మనసుతో వైద్యం చేయాల్సిన సందర్భాలే ఎక్కువగా ఉంటాయి. రోగి బంధువుల ఆగ్రహావేశాలకూ బలికావలసి ఉంటుంది. అటువంటి విషమ సమయాలను ఎదుర్కొన్న ప్రసిద్ధ డాక్టర్ల అనుభవాల సమాహారమే ఇది.

తిరుపతి
ఆంధ్రజ్యోతి



కనిపించే దేవుళ్లకు వందనం

ఎదుర్కొన్న విషమ సందర్భాలపై ప్రసిద్ధ వైద్య నిపుణుల జ్ఞాపకానుభవాలు



డాక్టర్ గణపతి సుబ్రమణ్యం
సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్

తిరుపతిలో కూడా గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రత్యేక విమానాల్లో గుండెను తీసుకువచ్చి అవసరమైనవారికి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో అమరుస్తున్నారు. ఈ అద్భుతం చేస్తున్నవారిలో ముఖ్యులు డాక్టర్ గణపతి సుబ్రమణ్యం. సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్. వైద్య రంగంలో పాతికేళ్లకు పైగా అనుభవం. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ (కార్డియోథొరాసిక్ సర్జరీ) చేసిన ఆయన ఆస్ట్రేలియా, చెన్నైల్లో గుండె మార్పిడి శస్త్రచికిత్సపై అధ్యయనం చేశారు. అనుభవం సంపాదించారు. అపోలో ఆస్పత్రిలో పనిచేస్తూ, 2021లో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి వచ్చారు. సీనియర్ సీటీ సర్జన్‌గా తిరుపతిలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేస్తూ, పిల్లల గుండె జబ్బులకు చికిత్స అందిస్తున్నారు.

గుండె మార్చడమా మానడమా..

ఆ పిల్లాడికి 15ఏళ్లుంటుంది. గుండె జబ్బుతో శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు చేశాం. గుండె పంపింగ్ ఛాంబర్‌లో రక్తపు గడ్డలున్నట్టు గుర్తించాం. గుండె జబ్బులున్నవారిలో ఇది చాలా అరుదు. కృత్రిమ పరికరం కూడా పెట్టలేని పరిస్థితి. దీనికి గుండె మార్పిడి ఒక్కటే మార్గం. సరిగ్గా అప్పుడే బ్రెయిన్ డెడ్ వ్యక్తికి సంబంధించిన డోనర్ అలర్ట్ వచ్చింది. అదృష్టవశాత్తూ మార్పిడి కోసం గుండె దొరికే అవకాశం ఉంది. ఆ పిల్లాడికి గుండె మార్పిడి చేయాలని నిర్ణయించుకున్నాం. అయితే వాళ్లది చాలా పేద కుటుంబం. గుండె మార్పిడి తర్వాత కూడా చాల ఖర్చు అవుతుంది. క్రమం తప్పకుండా డాక్టర్‌ను కలుస్తూ, మందులు వేసుకుంటుండాలి. అలా చేస్తారో లేదోనన్న అనుమానం కలిగింది. తగిన అవగాహన కల్పిద్దామనుకుని ఆపరేషన్‌కు సిద్ధపడ్డాం. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ ఉన్నట్టు గుర్తించాం. గుండె పనితీరు విఫలమైన రోగుల్లో ఇది సాధారణమే. అందుకే ఆపరేషన్‌కు అన్నీ సిద్ధం చేసుకున్నాం. అయితే అది ఫ్లూయిడ్ కాదని, కుడివైపు ఉన్న లంగ్‌కు ఇన్‌ఫెక్షన్ అని తేలింది. లంగ్ ఇన్‌ఫెక్షన్ ఉంటే గుండె మార్పిడి చేయకూడదు. మెత్తగా ఉండాల్సిన లంగ్ గట్టిగా మారిపోయి ఉంది. గుండె మార్పిడి తర్వాత ఇచ్చే డ్రగ్స్ వలన ఊపిరితిత్తులు ఇంకా ప్రమాదకర పరిస్థితికి వెళ్లొచ్చు. ఇటువంటి స్థితిలో ఏం చేయాలి? ఇంతలో డోనర్ హార్ట్ వచ్చేసింది. వేరే దారిలేదు. గుండె మార్చకపోయినా ప్రాణానికి ప్రమాదమే. అందుకే ముందుకు వెళ్లాలనే నిర్ణయించుకున్నాం. ఆపరేషన్ చేసేశాం. ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువై లైఫ్ రిస్క్ అయ్యే అవకాశం ఉంది. పల్మనాలజిస్ట్ ఓపీనియన్‌తో పోస్ట్ ఆపరేటివ్ కేర్ తీసుకున్నాం. వైద్యశాస్త్రంలో కూడా కొన్నిసార్లు అద్భుతాలు జరుగుతాయి. అదృష్టవశాత్తూ క్రమంగా ఆపిల్లాడికి లంగ్ ఇన్‌ఫెక్షన్ తగ్గింది. గుండె మార్పిడి చేసుకున్న అతను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు. రెగ్యులర్‌గా చెకప్‌కి వస్తున్నాడు. మందులు వేసుకుంటూ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. ఆ పిల్లాడి మొహంలో కనిపించే వెలుగు చాలదా ఒక డాక్టర్‌గా జీవితాంతం తృప్తి పడడానికి. స్విమ్స్ డాక్టర్ అల్లాడి మోహన్ ఒకసారి అన్నమాట గుర్తుకువస్తుంటుంది. 'ఇక్కడ ఒక్కోసారి అల్లోపతి, హోమియోపతి కన్నా కొండపై ఉన్న వెంకటాచలపతి వైద్యం పనిచేస్తుంటుంది' అని ఆస్పత్రిలోని వెంకన్న ఫొటో వైపు చూస్తూ చెప్పారు. నిజమే కదా!"

కోవిడ్ గడగడలాడించిన కాలంలో ఎందరికో ఆపద్బాంధవుడిగా నిలిచిన డాక్టర్.. పీజే నాయుడు. ఆస్టర్ నారాయణాద్రిలో సీనియర్ జనరల్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. కరోనా కల్లోలం సృష్టిస్తున్న రోజుల్లో వైద్యుడిగా ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివి. రోజుకు 12గంటలకు పైగా పీపీఈ కిట్ ధరించి కొవిడ్ వార్డుల్లోనే గడిపారు. సహచర వైద్యులకూ, సిబ్బందికీ ధైర్యం చెబుతూ, భరోసానిస్తూ రోగులకు సేవలందించారు. ఒక యోధుడిలా కొవిడ్‌పై యుద్ధం చేశారు.



డాక్టర్ పీజే నాయుడు
ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి

12గంటలూ పీపీఈ సూట్‌లో..

కొవిడ్ పీరియడ్ నా కెరీర్‌లో అతిక్లిష్టమైన సమయం. నేను వైద్యం చేసిన ప్రతి బాధితుడూ నాకొక జ్ఞాపకమే. కొవిడ్ అంటే అందరూ భయపడుతున్న రోజుల్లో పీపీఈ కిట్ ధరించి ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చింది. ఆ సమయంలో సన్నిహితులు, సహచర వైద్యులు కూడా కొవిడ్‌తో అడ్మిట్ అవుతున్నారు. వారిని వెంటిలేటర్ మీద ప్రమాదకర పరిస్థితుల్లో చూస్తుంటే గుండె తరుక్కుపోయేది. వైద్యుడిగా ఆ పరిస్థితి నన్ను బలహీనపరచకుండా చూసుకోవడం అన్నింటికన్నా పెద్ద సవాలుగా మారింది. అదొక యుద్ధ క్షేత్రం. వెనుతిరిగే సమయమూ లేదు. అవకాశమూ ఉండదు. కనిపించని క్రిమితో ప్రాణాలకు వెరవకుండా యుద్ధం చేయడమే. వెనుదిరగలేదు. ప్రతి కేసూ భిన్నమైనదే. పుస్తకాల చదువుకు అనుభవాన్ని జోడించి వైద్యం చేయాలి. ఊపిరాడని స్థితిలో వచ్చి చేరే బాధితులు.. వాళ్ల కోసం బంధుమిత్రుల ఆందోళనతో కూడిన ఒత్తిళ్లు, వీఐపీల ఫోన్లు.. కొవిడ్ కాలంలో దాదాపు పదివేల మంది బాధితులకు వైద్యసేవలు అందించి ఉంటా. ఒక వైద్యుడిగా బహుశా జీవితకాలంలో దక్కే అనుభవాలను కొవిడ్.. ఏడాదిలో నాకు ఇచ్చింది. ప్రాణాలొడ్డి చేసిన ఆ పోరాటం వృథా కాలేదు. ఇప్పటికీ నన్ను చాలామంది గుర్తుపట్టి చేతులు జోడించి పకలరిస్తూ ఉంటారు. 'మీరు మా ఇంట్లోవాళ్లకు కొవిడ్‌లో వైద్యం చేశారు. దేవుడు సర్' అంటుంటారు. ఆ తర్వాత నన్ను ఒక మాట అడుగుతుంటారు. 'కొవిడ్‌లో భయపడకుండా ఎలా ఉన్నారు?' అని. వారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే.. 'నేను స్వామి సన్నిధిలో సేవ చేస్తున్నా. నన్ను ఆయనే చూసుకుంటారు' అని. అదే జరిగింది."

వైద్యరంగంలో పరిచయం అక్కర్లేని పేరు డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి. ఆరోగ్యపరంగా జిల్లాకు ఏ కష్టం వచ్చినా యంత్రాంగానికి వెంటనే ఆమె గుర్తుకొస్తారు. కొవిడ్ విపత్తులో ప్రతినిత్యం ఇటు మాధ్యమాల ద్వారా, అటు కొవిడ్ వార్ కమిటీలోనూ చురుకైన పాత్ర పోషించారు. వైద్యానికి మానవీయతను జోడించిన అరుదైన వైద్యురాలు. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలబాలికలకు శారీరక అవగాహన కల్పిస్తుంటారు. షుగర్ వ్యాధి ప్రభావాల మీద విశేష అధ్యయనం చేశారు. అనేక దేశాల వైద్య సెమినార్లలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బైరాక్' (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్) ఇండిపెండెంట్ డైరెక్టర్. తెలుగు రాష్ట్రాల నుంచి బైరాక్‌కు ఎంపికైన తొలి ప్రతినిధిగా చరిత్ర సృష్టించి తిరుపతి ప్రైడ్‌గా నిలిచారు.



డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి
సీనియర్ ఫిజిషియన్

భారతి నేర్పిన పాఠం

నేను రుయాలో పనిచేస్తున్న రోజులు అవి. సూళ్లూరుపేట ప్రాంతం నుంచి భారతి అనే అమ్మాయి తీవ్ర రక్తహీనతతో వచ్చింది. ఏప్లాస్టిక్ అనీమియా. రక్తహీనతతో పాటూ ప్లేట్‌లెట్‌లు తగ్గిపోయి ఆమె శారీరక స్థితి దారుణంగా ఉంది. అప్పట్లో తిరుపతిలో హెమటాలజీ కూడా లేదు. తగిన పరీక్షలు చేయించుకోవడానికి వాళ్ల దగ్గర డబ్బులులేవు. కూలి చేస్తే తప్ప కూడులేని కుటుంబానికి ఆ పిల్లకి వైద్యం చేయించడం అసాధ్యం. పెద్ద ఆస్పత్రులకు వెళ్లలేరు. ప్రభుత్వ ఆస్పత్రి కాబట్టి రుయాకి వచ్చారు. తక్షణం పరీక్షలు చేయించాలి. వెంటనే వైద్యం మొదలు పెట్టాలి. వాళ్ల నాన్న వైద్యం చేయించలేమని చేతులెత్తేశాడు. టీనేజ్‌లోకి ప్రవేశిస్తున్న ఆ పాపను చూస్తే గుండె తరుక్కుపోతోంది. అలా వదిలేయలేకపోయాను. నా జీతం అప్పుడు రూ.6,500. ఆనెల జీతంలోనుంచి వెయ్యి రూపాయలు ఇచ్చి వైద్య పరీక్షలు చేయించాను. రుయాలో అడ్మిట్ చేయించాను. ఆ అమ్మాయి పరిస్థితిని వివరిస్తూ సాయం కోసం మీడియాలో కథనాలు వచ్చేలా చేశాను. ఎందరో దాతలు ముందుకొచ్చారు. అప్పటి ఎంపీ డాక్టర్ చింతామోహన్‌కి చెప్పి ఎంపీ నిధుల నుంచి రూ.12వేలు ఇప్పించాను. ఆతర్వాత వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశాం. వైద్యం కొనసాగింది. జీవితం మీద ఆశ పెంచుతూ ఆ పాపతో తరచూ మాట్లాడిన మాటలు చాలా పనిచేశాయి. ఆమెతో ఆత్మవిశ్వాసం పెరిగింది. బేలగా, బలహీనంగా ఆస్పత్రికి వచ్చిన అమ్మాయి దృఢంగా మారింది. క్రమంగా కోలుకుంది. ప్రాణాలతో తిరిగి రాదు అనుకున్న ఆ అమ్మాయి ఆరోగ్యంగా తిరిగి ఊరికి వెళ్లింది. చదువు కొనసాగించింది. అందుకు గ్రామస్తులు, టీచర్లు సహకరించారు. బీఎడ్ పూర్తిచేసింది. ఉద్యోగం సంపాదించింది. పెళ్లి కూడా చేసుకుంది. నేనూ వెళ్లాను. గలగలా మాట్లాడుతూ ఒక ఉత్సవంలా కనిపిస్తున్న భారతిని చూసినపుడు డాక్టర్‌గా కలిగిన ఆనందం వర్ణించలేనిది. ఆమెకు నేను చేసిన సాయం వెయ్యి రూపాయలు మాత్రమే. కానీ అవసర సమయంలో చేసిన ఆ వెయ్యి, ఇంకెన్నో వేలు వచ్చేలా దారి వేసింది. ఆమె ప్రాణాలు నిలిపింది. ఒక డాక్టర్, తమ దగ్గరకు వచ్చినవారి రోగాన్ని మాత్రమే చూస్తే సరిపోదు. మందులు మాత్రమే పరిష్కారం కాదు. వాళ్ల సామాజిక, ఆర్థిక పరిస్థితులు గమనించి చెప్పే మాటలు, ఇచ్చే ధైర్యం, భరోసా, సరైన సమయంలో చేసే సహాయం ఒక కుటుంబాన్నే నిలబెడతాయి అనే పాఠం భారతి సంఘటన నుంచి నేను నేర్చుకున్నాను."



డాక్టర్ పార్థసారథిరెడ్డి
సీనియర్ గైనకాలజిస్ట్

సాధారణంగా పురుష వైద్యులు గైనకాలజీ కోర్సును పెద్దగా ఎంచుకోరు. డాక్టర్ పార్థసారథిరెడ్డి మాత్రం గైనకాలజీ చేసి, నిపుణుడైన వైద్యుడిగా తిరుపతి నగరంలో పేరుపొందారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నారు. పాతికేళ్లకు పైగా అనుభవం. పేదలు ఆయన్ని వెతుక్కుంటూ వస్తారు. ప్రసూతి ఆస్పత్రిలో ఆయన ఓపీకి చాలా డిమాండు. సాయంత్రం వేళ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోనూ సేవలందిస్తారు. తక్కువ ఖర్చుతో కాన్పులు చేస్తారు. అనవసర సిజేరియన్‌లను ప్రోత్సహించరు.

అర్ధరాత్రి యుద్ధం

పదేళ్ల కిందట.. గర్భంతో ఉందంటూ ఒక మహిళను తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెది వెంకటగిరి. ఆపరేషన్ చేసి బిడ్డను తీయమన్నారు. కడుపు నొప్పితో ఆమె మెలికలు తిరిగిపోతోంది. స్కానింగ్ చేశాం. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా ప్రాథమిక అంచనాకు వచ్చాం. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం. రాత్రి 10 గంటలకు ఆపరేషన్ మొదలుపెట్టాం. సిజేరియన్ కోసం పొట్ట దగ్గర కట్ చేసి చేయిపెట్టగానే పెద్దరక్తనాళంలో గడ్డ పగిలిపోయి, విపరీతమైన రక్తస్రావం జరిగింది. గుండెనుంచి వచ్చే ధమనిలో (కిడ్నీల సమీపంలో) పెద్దగడ్డ (ఇలియాక్ ఆర్టరీ ఎన్యూరిజమ్) పెరిగి ఉంది. నిజానికి గర్భాశయంలో బిడ్డ లేదు. ఆపరేషన్ ప్రక్రియ మొదలుపెట్టగానే గడ్డ పగిలిపోయింది. విపత్కర పరిస్థితి. వెంటనే రుయానుంచి యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ భారతిని పిలిపించాం. ఈలోగానే ఆమెకు మూడు సార్లు కార్డియాక్ అరెస్టు వచ్చింది. పరిస్థితి వివరించగానే స్విమ్స్‌నుంచి ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అబాచంద్రన్ వచ్చారు. ఆపరేషన్ కొనసాగింది. రాత్రి పది గంటలకు మొదలైన ఆపరేషన్ పూర్తయ్యేసరికి తెల్లవారుజాము 4గంటలైంది. విజయవంతంగా రక్తనాళాన్ని సరిచేశాం. అయితే ఆమెకు వెంటిలేటర్ సహాయం కావాలి. స్విమ్స్‌కు తీసుకువెళ్లాలి. మధ్యలో ఏం జరుగుతుందో తెలీదు. నేనే దగ్గరుండి తీసుకెళ్లా. అక్కడ రూ.3వేలు అడ్వాన్స్ కట్టమన్నారు. రోగి సహాయకుల దగ్గర డబ్బులు లేవు. నా దగ్గర ఉన్న డబ్బులు కట్టేసి అడ్మిట్ చేశా. ఆ అర్ధరాత్రి ఒక యుద్ధంలా సాగింది. ప్రతి క్షణం టెన్షన్‌తో గడిచింది. సమయానికి అందరు డాక్టర్లూ వచ్చి సహకరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల గురించి చులకనగా మాట్లాడేవాళ్లకు ఇటువంటివి అర్థమైతే బావుండును. రెండు రోజులకే ఆమె కోలుకున్నారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళుతూ నా దగ్గరకొచ్చి చేతులు జోడించిన ఆమె కళ్లలో తొణికిసలాడిన నీటి పొరను చూసి నాకళ్లు కూడా చెమ్మగిల్లాయి.. అయితే ఆ ప్రాణాన్ని కాపాడగలిగాము కదా అనే ఆనందంతో."

నెర్రి కాలువ ఆధునికీకరణ పనులు జరిగేనా?

కొత్త ప్రభుత్వం రావడంతో కోటి ఆశలతో రైతుల ఎదురుచూపులు



పిచ్చిమొక్కలతో నిండిన నెర్రికాలువ

సూళ్లూరుపేట, జూన్ 30: నెర్రికాలువ ఆధునికీకరణ పనులు రెండేళ్ల కిందట పడకేశాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని సుమారు 20 వేల ఎకరాలకు పైగా నెర్రికాలువ ద్వారా సాగునీరు అందుతోంది. కాలువ ఆధునికీకరణకు గత ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేసింది. 2019లో అప్పటి జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ చేతుల మీదుగా సూళ్లూరుపేటలో పనులకు భూమి పూజ చేశారు. కాలువ పూడికతీతతోపాటూ రెండు వైపులా లైనింగ్ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు దొరవారిసత్రం మండలంలో రెండు కిలోమీటర్లు, సూళ్లూరుపేట మండలంలో అర కిలో మీటరు మేర పనులు జరిగాయి. అయితే సాఫీగా వస్తుందని ఆశించిన రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. 2023 చివరి నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా బిల్లులందక కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీనిపై తాము నష్టపోతున్నామని పలుసార్లు రైతులు సంబంధిత అధికారులు, నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు.





కోతకు గురైన కాంక్రీట్ గోడ - సూళ్లూరు వద్ద కట్టలు దెబ్బతిన్న కాలువ

కొత్త ప్రభుత్వం.. కోటి ఆశలు..

కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో అటకెక్కిన నెర్రికాలువ ఆధునికీకరణ పనులు జరుగుతాయని కోటి ఆశలతో రైతులు ఎదురు చూస్తున్నారు. కేవీబీపురం మండలం నుంచి వచ్చే కాళంగి నదికి దొరవారిసత్రం మండలంలోని తనియాలి సమీపాన కొస్నేళ్ల కిందట ఆనకట్ట నిర్మించారు. ఇక్కడ నుంచి దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అప్పట్లోనే 17.5 కిలోమీటర్ల మేర నెర్రికాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లో 20 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందడమే కాకుండా సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందించే సమ్మర్ స్టోరేజ్ పథకానికి కూడా నెర్రి కాలువే ఆధారం. సాగు, తాగునీటికి ఆధారమైన నెర్రికాలువలో పూడిక పేరుకుపోయింది. పలుచోట్ల కాలువల కట్టసైతం దెబ్బతినింది. సూళ్లూరుపేట ప్రాంతంలో ఈ కాలువలో మురుగు కలుస్తోంది.

ఎక్కడ వేసిన గొంగడి...

సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో దాదాపు 17 నెలలుగా పనులు ఎక్కడవేసిన గొంగడి... అక్కడే అన్న చందగా మారాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో రైతుల్లో మంచి ఆశలు చిగురించాయి. వచ్చేది వ్యవసాయ సీజన్ కావడంతో కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తే మూడు మండలాల్లో సాగునీటికి ఇబ్బందులుండవు. ఇటీవల జరిగిన అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే విజయశ్రీ కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా సాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చొరవ తీసుకుంటామని తెలిపారు.

ప్రతి ఎకరాకు 'గంగ' నీరు: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూన్ 30: మండలంలోని చిలమనూరు సహా చుట్టు పక్కల ప్రతి ఎకరాకు తెలుగంగ నీరు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నాయుడుపేట - వెంకటగిరి రోడ్డు మార్గంలో గొల్లగుంట వద్ద ఎం.గురువేంద్ర ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి, మహిళల మంగళహారతులతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కురుగొండ్ల మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేసే వ్యక్తి సీఎం చంద్రబాబు అని కొనియాడారు. చిలమనూరు సమీపంలోని ఎస్సీ కాలనీలో ఇళ్లపై వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను దారి మళ్లించేలా చర్యలు చేపడుతామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. కేంద్రరాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వాలు ఉండడంతో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యంనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్ రావు, డి.రాజగోపాల్ నాయుడు, డి.ప్రభాకర్ నాయుడు, పి.రాజేశ్వరావు సహా జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం చిలమనూరులో కొలువై ఉన్న ఎల్లమ్మదేవత కు పొంగళ్ల కార్యక్రమంలో కురుగొండ్ల పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల సంక్షేమంతోపాటు భద్రత అవసరం

ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ



తాళం అందుకుంటున్న విజయశ్రీ

నాయుడుపేట, జూన్ 30: ప్రైవేట్ రవాణా రంగంలో ఉన్న డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమంతోపాటు వారి కుటుంబ భద్రత ఎంతో అవసరమని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో ఆదివారం శ్రీ బాలాజీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.సత్యం అధ్యక్షతన ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రవాణా రంగంలో ఉన్న కార్మికులకు ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇక తమ వద్ద పని చేసే కార్మికుల కుటుంబ భద్రత కోసం యజమాన్యం వారికి ఇన్సూరెన్స్ కల్పించాలని సూచించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ కోసం నెల్లూరు ఎంజీ బ్రదర్స్ ఈడీ రాఘవేంద్ర, మహీంద్ర - 300 వాహన తాళాన్ని ఎమ్మెల్యే విజయశ్రీకి తాళం అందజేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... లారీ ఓనర్స్ అసోసియేషన్ ఐకమత్యంగా ఉం డాలని, తద్వారా యజమానులు, కార్మికులు అభివృద్ధి చెందుతారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... సీరియల్ ప్రకారం లారీలను పంపిస్తే అందరికీ మంచి జరుగుతుందన్నారు.సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాల చంద్రారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రామచంద్ర నా యుడు, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు హంసా రాము తదితరులు పాల్గొన్నారు.

కక్షలు, సాధింపులు ఉండవు: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, జూన్ 29 : గాడితప్పిన పాలనను పట్టాలెక్కించే అజెండాగా పనిచేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం చిల్లమానుచేనులో ఎమ్మెల్యే విజయశ్రీ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తప్పుచేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. అనంతం చిల్లమానుచేను ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం సమయంలో స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు గున్నం సేవా ట్రస్ట్ అధినేత, టీడీసీ సీనియర్ నాయకుడు గున్నం మధురెడ్డి ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను విజయశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జనసేన నాయకుడు ప్రవీణ్ కుమార్, టీడీపీ మండల కన్వీనరు గుజ్జులపూడి విజయకు మార్‌నాయుడు, అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, కె.గోపాల్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు పెద్దపీట

కోట, జూన్ 30: తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు ప్రాధాన్యం ఇస్తారని అందుకు పలు నిదర్శనలు ఉన్నాయని ఆ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కందల బాలకృష్ణయాదవ్, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి టి.సురేష్‌బాబు అన్నారు. కోట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రాజ్యాంగపరంగా బీసీల హక్కులు, చట్టాలను అమలు చేసింది సీఎం చంద్రబాబే అన్నారు. అంతేకాకుండా బీసీ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసయాదవ్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం కూడా ఇందులో భాగమేనన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీలకు సముచితస్థానం కల్పిస్తారని అది టీడీపీకే సాధ్యమన్నారు.

ఏపీటీఎఫ్ సభలను విజయవంతం చేయండి



పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు, జూన్ 30: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్టోబర్‌లో విజయనగరంలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ నాయకులు హృదయరాజు, చిరంజీవి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగం అభివృద్ధి కోసం ఏపీటీఎఫ్ అలుపెరుగని పోరాటాలను సాగిస్తుందన్నారు. జీవో 117ను రద్దు చేయాలని, అంతర్‌జిల్లాల బదిలీలు చేపట్టాలని, 12వ వేతన సవరణ కమిటీ అమలు చేయాలని కోరారు. బాబు, జైపాల్‌రెడ్డి, శివకుమార్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 30 : నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని కర్మాగారంలో పని చేస్తున్న ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి అనే కార్మికుడు కర్మాగారంలో ఆదివారం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. కర్మాగార అంబులెన్స్‌లో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం చెన్నైకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించండి: పాశం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 30: విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ స్పోర్ట్స్ మీట్‌ను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాశం మాట్లాడుతూ గూడూరు పట్టణం క్రీడలకు పుట్టినిల్లన్నారు. ఈ స్టేడియం నుంచి పలు క్రీడల్లో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి గూడూరుకు మంచి పేరు తెచ్చారన్నారు. 35 ఏళ్లుగా అల్లూరు ఆదిశేషారెడ్డి స్పోర్ట్స్ మీట్‌ను యేటా నిర్వహిస్తూ క్రీడాకారులను రోటరీ క్లబ్ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్రీడల ద్వారా మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. స్టేడియం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. శనివారం జరిగిన టీ-20 వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ టీం ఇండియా క్రికెట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. జట్టు సత్తాచాటి ప్రపంచకప్‌ను గెలుచుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన రెడ్డి, ఎ.గోపాల్‌రెడ్డి, జానకి రామిరెడ్డి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎన్.భాస్కర్‌రెడ్డి, రాంప్రసాద్, రామకృష్ణస్వరూప్, శ్రీధర్‌రెడ్డి, జి.జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే పింఛన్.. ఎన్నికల సమయంలో తమ పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛను అందిస్తామని ఎమ్మెల్యే పాశం తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు జూలైతోపాటు ఏప్రిల్ నెల నుంచి పెంచి పెన్షన్‌ను మొత్తం కలిపి రూ. 7వేలు సచివాలయం సిబ్బంది అందిస్తారన్నారు. కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు.

నిమ్మ ధరలు ఢమాల్



గూడూరు అర్బన్, జూన్ 30: ఢిల్లీ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు గూడూరు నిమ్మ రైతులను ముంచేశాయి. గూడూరు మార్కెట్‌లో నిమ్మకాయలు ఆదివారం కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలికాయి. ఈ ఏడాదిలోనే ఈ ధరలు అతి తక్కువ కావడం గమనార్హం. ఇక్కడినుంచి ఎక్కువగా ఢిల్లీకే నిమ్మకాయలు ఎగుమతి అవుతాయి. కొద్దిరోజులుగా దేశ రాజధానిలో వర్షాలు పోటెత్తడంతో అక్కడి నిమ్మ మార్కెట్ స్తంభించింది. మిగతా ఉత్తరాది ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తుండడంతో ఒక్కసారిగా ధరలు కుప్పకూలాయి. తక్కువ నాణ్యతతోపాటు ఒకమాదిరిగా ఉన్న కాయలు కూడా అమ్ముడు పోలేదు. రోజంతా కష్టపడి కాయలు కోసుకొచ్చిన రైతులు, వందలాది రూపాయలు కూలీలకు ఖర్చు చేసి కాయలు పోగేసుకుని మార్కెట్‌కు వచ్చిన వారికి ఆదివారం నాటి ధరలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు నైరాశ్యంలో మునిగిపోయారు. కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వమైనా నిమ్మకు గిట్టుబాటు ధరలపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయ ఈవోగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి



శ్రీకాళహస్తి, జూన్ 30: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా తిరుపతి దేవదాయశాఖ ఆర్‌జేసీగా పనిచేస్తున్న ఎన్‌వీఎస్ఎన్ మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, సతీష్‌మాలిక్, నాగభూషణంయాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో దువ్వూరు చేరిక ఖాయమేనా?

నాయుడుపేట/తడ, జూన్ 30: వైసీపీ రాజీనామా చేసిన చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరిక ఖాయమేనా అంటూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. బాలచంద్రారెడ్డి శనివారం వైసీపీకి రాజీనామా చేసిన విషయం విదితమే. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో విభేదించడమే రాజీనామాకు కారణం. అయితే రాజీనామా అనంతరం ఆయన టీడీపీలో చేరుతారంటూ జోరుగా ఊహాగానాలు మొదలయ్యాయి. ఆయనతోపాటు కిలివేటి సంజీవయ్య వ్యతిరేక వర్గ నాయకులంతా దువ్వూరును అనుసరించే ఆస్కారం ఉందంటూ ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక లారీ అసోసియేన్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సన్మాన కార్యక్రమానికి బాల చంద్రారెడ్డితోపాటు వైసీపీ అసమ్మతి నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, కళత్తూరు రామమోహన్‌రెడ్డి పాల్గొనడం చర్చనీయాంశమైంది. అందుకు తగ్గట్టుగా మరో 3, 4 రోజుల్లో బాల చంద్రా రెడ్డి ఆయన అనుచరులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆ సమావేశంలోనే ఆయన అనుచరులు, వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీలో చేరికపై స్పష్టమైన ప్రకటన చేయనున్నట్లు సమాచారం. టీడీపీ అధిష్ఠానంతో సైతం చర్చలు జరిపినట్లుగా ఈ మేరకు వీరిని పార్టీలో చేర్చుకునేందుకు అధినాయకత్వం సైతం సుముఖంగా ఉన్నట్లు బాల కృష్ణారెడ్డి అనుచరులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీలో చేరిక దాదాపుగా ఖరారైనట్లుగా ప్రచారం సాగుతోంది.

పింఛన్ల పంపిణీ వందశాతం పూర్తి చేయాలి

పెళ్లకూరు, జూన్ 30: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వంద శాతం పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణరావు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాళ్వాయిపాడులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని వంద శాతం పూర్తి చేయాల్సి ఉందన్నారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, జూన్ 30: గనుల్లో పనిచేసే కార్మికుల భద్రతకు యజమానులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ అధికారి భూషణ్‌ప్రసాద్‌సింగ్ అన్నారు. ఆదివారం గోగినేనిపురం సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో 50వ నెల్లూరు గనుల భద్రత ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గనుల్లో పనిచేసే కార్మికులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సీనియర్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో రఘుపతి పెద్దిరెడ్డి, అప్పలనాయుడు, ద్వారకనాథ రెడ్డి, భరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచకప్ కైవసం యువతకు స్ఫూర్తి దాయకం

● మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట, జూన్ 30: ఎంతో ఆసక్తికరంగా సాగిన టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టు కెప్టెన్ రోహిత్‌శర్మ టీం కప్పును కైవసం చేసుకోవడం యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో యువత అనేక మానసిక ఒత్తిళ్లకు లోనవుతోందన్నారు. మానసిక ఒత్తిళ్లను జయించడానికి అలాగే దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని నెలవల చెప్పారు. క్రీడలు వల్ల ఇతర ప్రాంతాల వారితో మంచి సత్సంబంధాలు నెలకొంటాయన్నారు. నెలవల వెంట తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్ తదితరులు ఉన్నారు.

కలుషిత నీటితో పేటవాసుల అవస్థలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ కొళాయిలో వస్తున్న కలుషిత నీరు

నాయుడుపేట, జూన్ 30: పట్టణంలోని ఎల్ఏసాగరంలో కొంతకాలంగా మున్సిపల్ కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోంది. నీరు నురుగుతోపాటు దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలో కొంత కాలంగా గ్యాస్ పైపులైన్ కోసం తవ్వకాలు జరుపుతుండడంతో పలు ప్రాంతాల్లో తాగునీటి పైపు లైన్లు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న తాగునీటి పైపు లైన్ వద్ద మురుగు నీటి కాలువలు ఉండటంతో ఆ మురుగు పైపులైన్ ద్వారా సరఫరా అవుతుంది. దాంతో ప్రజలు మున్సిపాలిటీ నీటిని తాగడానికి, వంటలకు వినియోగించుకోలేక క్యాన్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. ఆ నీటితో స్నానం చేస్తే దురద వస్తోందంటున్నారు. కలుషిత నీటి సరఫరాపై మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి మాట్లాడుతూ... తాగునీటి సరఫరా మోటర్లు కాలిపోవడంతో మరమ్మతులు చేస్తున్నా మన్నారు. అలాగే దెబ్బతిన్న పైపు లైన్లను సరి చేస్తున్నామన్నారు. మూడు రోజుల్లో స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైంది



సుబ్రహ్మణ్యం దంపతులకు సన్మానం

వెంకటగిరి, జూన్ 30: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరప్రదమైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పదవీ విరమణ పొందిన సోమసానిగుంట ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పి. సుబ్రహ్మణ్యంను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... సుబ్రహ్మణ్యం ఎక్కువ కాలం వెంకటగిరి, డక్కిలి మండలాల్లో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారన్నారు. ఎంతకాలం పనిచేశామన్నది ముఖ్యంకాదని చేసినంత కాలం ఏం మేలు చేశామన్నది ముఖ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ... టీచర్ సుబ్రహ్మణ్యంను శత్రువులు కూడా అభిమానిస్తారని చెప్పారు. రిషితారెడ్డి, పి.రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమ్మ గ్రామోత్సవం



కోట, జూన్ 30: కోట గ్రామదేవత కోటమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు పట్టణంలో ఊరేగారు. అమ్మవారు ఊరే గుతున్న సమయంలో భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కోట చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పొట్టేళ్లు, మేకపోతులను బలి ఇచ్చి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తెలంగాణా ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే పరామర్శ



కోట, జూన్ 30 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పలువురిని పరామర్శించారు. విద్యానగర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలసుబ్రహ్మణ్యంను పరామర్శించారు. అదే విధంగా వంజివాకలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించి భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ పవన్‌కుమార్, మస్తాన్‌బాషా, డి.సురేష్, టి.సురేష్‌బాబు తదితరులున్నారు.

నేడే పింఛన్ల పండగ

● లబ్ధిదారులకు ఇంటి వద్దే పంపిణీ

● ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30: జిల్లావ్యాప్తంగా సోమవారం పింఛన్ల పండగ మొదలు కానుంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దే ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు అవ్వాతాతలకు రూ.3వేలుగా ఉన్న పింఛనును ఈనెల నుంచి రూ.వెయ్యి పెంచి రూ.4వేల చొప్పున ఇవ్వనున్నారు. అలాగే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి బకాయిలు రూ.3వేలను కలిపి అందజేస్తారు. అంటే సోమవారం నాడు ఒక్కొక్కరికి రూ.7వేలను ఇస్తారు. కాగా, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల కింద జిల్లాలో 2,69,162 మంది లబ్ధిదారులకు రూ.182.33కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ సొమ్మును శనివారమే అధికారులు డ్రా చేశారు. ఇక ఒక్కో ఉద్యోగికి.. పింఛన్ల పంపిణీకి 50 ఇళ్లు కేటాయించారు. ఈ పింఛన్ల పండగలో టీడీపీ శ్రేణులు కూడా భాగస్వాములు కానున్నాయి. అనివార్య కారణాలతో ఎవరైనా మిగిలి ఉంటే రెండో రోజైన మంగళవారం పింఛను సొమ్ము అందజేస్తామని ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు.

విభజన హామీలను సాధించుకుందాం

ఏపీ స్టూడెంట్స్ జేఏసీ

గూడూరు అర్బన్, జూన్ 30: విభజన హామీ చట్టంలో రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలను సాధించుకునేందుకు ఏపీ స్టూడెంట్స్ జేఏసీని బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేటు కళాశాలలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో తమ యూనియన్‌ను బలోపేతం చేస్తూ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను సాధించుకునేందుకు పోరాటాలు సాగిస్తామన్నారు. లవణ్‌కుమార్, సూర్య, శ్రీధర్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, జూన్ 30: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సం క్షేమ సంఘం ఆధ్వ ర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రతినెలా క్రమం తప్పకుండా పేదలకు ఈ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామన్నారు. సనత్ కుమార్‌రెడ్డి, ధనుంజయ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 30: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజ లు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనం తరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ విజయం సాధించడంతో మండల కేంద్రంలోని చెన్నకేశస్వామి, వినాయక స్వామి ఆలయాల్లో ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రా రెడ్డి, దాసరి రాము, బెల్లంకొండ మల్లికార్జున్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.